జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

సోమవారం 12-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :226 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత

# 1000 ఏళ్ల తర్వాత కూడా

## ఈ ఆలయంపై జెండా ఎగురుతూనే ఉంది: ప్రధాని మోదీ



- గత ప్రభుత్వాలు బానిస మనస్తత్వంతో సోమనాథ్ ఆలయ చరిత్రను తుడిచిపెట్టేందుకు మరియు దాని ప్రాముఖ్యతను విస్మరించడానికి ప్రయత్నించాయని ప్రధాని విమర్శించారు.
- స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ పటేల్ చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ ప్రయత్నాలను అడ్డుకున్నారని ఆయన ధ్వజమెత్తారు.
- భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ క్షేత్రాన్ని సందర్శించాలని నిర్ణయించుకున్నప్పుడు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు.
- విదేశీ దురాక్రమణదారులు అనేక దండయాత్రలు చేసినప్పటికీ, 1000 ఏళ్ల తర్వాత కూడా ఆలయంపై జెండా ఎగురుతూనే ఉండటం భారత దేశ స్ఫూర్తికి మరియు దృఢసంకల్పానికి నిదర్శనమని చెప్పారు.

ఇంటర్నెట్‌డెస్క్: సోమనాథ్ ఆలయ చరిత్రను తుడిచిపెట్టేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని ప్రధాని మోదీ అన్నారు. బానిస మనస్తత్వంతో దాని ప్రాముఖ్యతను విస్మరించారని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి విమర్శలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ పటేల్ చేసిన ఆలయ పునర్నిర్మాణ ప్రయత్నాలను అడ్డుకున్నారని విమర్శించారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలని నిర్ణయించుకున్నప్పుడు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ధ్వజమెత్తారు. మూడు రోజుల గుజరాత్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ సోమనాథ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

సోమనాథ్ పై విదేశీ దురాక్రమణదారులు అనేక దండయాత్రలు చేశారని ప్రధాని అన్నారు. ఈ ఆలయం.. ధైర్యం, త్యాగాలు, దృఢసంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. 1000 సంవత్సరాల తర్వాత కూడా ఆలయంపై జెండా ఎగురుతూనే ఉందని, అది భారత దేశ స్ఫూర్తిని ప్రపంచానికి చాటుతోందని వెల్లడించారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్.. భారతదేశ విశ్వాసానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. ఆ స్వాభిమాన్ పర్వ్‌లో పాల్గొనడం ఒక గొప్ప జ్ఞాపకమన్నారు. పేజి 2లో ▶

## ఏదో ఒక రోజు కేరళలో అధికారంలోకి వస్తాం: అమిత్ షా



ఏదో ఒక రోజు భాజపాకు చెందిన నేత కేరళకు సీఎం అవుతారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. భాజపాకు తిరువనంతపురం కీలక మైలురాయని అభివర్ణించారు. పేజి 2లో ▶

## ఫోన్, ఇంటర్నెట్ వాడని అజిత్ ధోబాల్..



2లో

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ ఫోన్, ఇంటర్నెట్ వాడరట.

# హైదరాబాద్–విజయవాడ

## హైవేపై ఒక్కసారిగా పెరిగిన రద్దీ



2లో

## అమరావతిపై అసంబద్ధ ప్రకటనలతో జగన్ నవ్వుల పాలు: యనమల



అమరావతి: రాజధాని అమరావతిపై అసంబద్ధ ప్రకటనలతో జగన్ నవ్వులపాల వుతున్నారని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. రాజ్యాంగంలో క్యాపిటల్ అనే పదం లేదనడం ఆయన అవగాహనారాహిత్యానికి నిదర్శమని చెప్పారు. ఈ మేరకు యనమల ఓ ప్రకటన విడుదల చేశారు. “రాజధానిపై వేర్వేరు మాటలు చెప్పడం.. జగన్ గందరగోళాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రపంచంలోని అనేక రాజధానులు నదీతీరాల పక్కనే ఉన్నాయి. అమరావతి అభివృద్ధి చెందకూడదనేదే జగన్ వ్యాఖ్యల ఉద్దేశం. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనే లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది” అని యనమల పేర్కొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు డిప్యూటీ సీఎం భట్టి లేఖలు

హైదరాబాద్: రాష్ట్రంలోని సుమారు 83 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేఖలు రాశారు. వాటిని విద్యుత్ అధికారులు స్వయంగా వెళ్లి వినియోగదారులకు అందజేస్తున్నారు. భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు.. విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు, డిప్యూటీ సీఎం సందేశంతో కూడిన లేఖలను గృహజ్యోతి లబ్ధిదారులు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు అందజేస్తున్నారు. వినియోగదారుడి పేరు, సర్వీస్ కనెక్షన్ నంబర్‌తో వ్యక్తిగతంగా ప్రస్తావిస్తూ రాసిన ఈ లేఖలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు స్వయంగా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు.



## శాఖ ఒకరిది..

### పెత్తనం మరొకరిది: హరీశ్‌రావు



హైదరాబాద్: సినిమా టికెట్ల ధరల పెంపుపై హైకోర్టు మొట్టికాయలు వేసినా సర్కారు తీరు మారలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. థియేటర్లలో కంటే సచివాలయంలోనే సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని వ్యాఖ్యానించారు. సినిమాటోగ్రఫీ మంత్రికి తెలియకుండానే ధరల పెంపు జీవో ఇచ్చారని హరీశ్‌రావు విమర్శించారు. శాఖ ఒకరిది.. పెత్తనం మరొకరిదని ఎద్దేవా చేశారు. నచ్చిన వారి సినిమాల టికెట్ల ధరల పెంపునకు అనుమతి ఇస్తారా? అని ప్రశ్నించారు.

## అత్యాధునిక పద్ధతిలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాలు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, ఇంజనీర్లతో మంత్రి సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన పునఃప్రారంభ పనులు చేపట్టాలని ఆదేశించారు. సొరంగం తవ్వడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నట్లు మంత్రి తెలిపారు.



2లో

## పవన్‌కల్యాణ్ అరుదైన ఘనత..

### 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' టైటిల్



2లో

సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అరుదైన ఘనత సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యులైన ఆయన.. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొంది అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు.

# పోలవరం - నల్లమలసాగర్‌పై

## సుప్రీంలో విచారణ.. లీగల్ టీమ్‌తో మంత్రి నిమ్మల సమీక్ష

- లీగల్ టీమ్‌కు దిశానిర్దేశం: సోమవారం సుప్రీం కోర్టులో జరగనున్న విచారణలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించాలని మంత్రి లీగల్ టీమ్‌కు సూచించారు.
- పాల్గొన్న అధికారులు: ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి మరియు అంతర్రాష్ట్ర సాగునీటి విభాగం ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.
- రికార్డుల సమర్పణ: కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను వెంటనే లీగల్ టీమ్‌కు అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



2లో

# సంపాదకీయం

## అమరావతిపై అవే కుట్రలు

'ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అదే సచివాలయం'... అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ అన్న మాట ఇది. 'ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అదే రాష్ట్ర రాజధాని అవుతుంది' ముఖ్యమంత్రిగానూ, మాజీ అయ్యాకా జగన్మోహన్ రెడ్డి అన్న మాట, అంటున్న మాట ఇదే! కేసీఆర్--జగన్‌ల మధ్య ఎన్నో సారూప్యతలు ఉన్నాయి. అందుకే కాబోలు ఇద్దరి మధ్య విడదీయలేని బంధం ఏర్పడింది. అదే సమయంలో ఆలోచనలు కూడా అదే విధంగా సాగుతున్నాయి. ఇరువురికీ మొదటి నుంచి ఉమ్మడి శత్రువు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కనుక వారు ఒకే దృక్పథంతో వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి సచివాలయానికి వెళ్లడం నామోషీగా కేసీఆర్ భావించగా, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రాజధానే అవసరం లేదని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వారందరూ విధుల నిర్వహణకు సచివాలయానికి వెళ్లేవారు. మంత్రివర్గ సమావేశాలు కూడా అక్కడే నిర్వహించేవారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇదే విధానాన్ని అనుసరించారు. కేసీఆర్ ఒక్కరే సచివాలయం ఉనికిని గుర్తించడానికి ఇష్టపడలేదు. 'ప్రగతి భవన్' పేరిట ఖరీదైన భవనాన్ని నిర్మించుకొని అక్కడే నివాసం--కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అధికారిక సమావేశాలు, మంత్రివర్గ సమావేశాలు కూడా అక్కడే నిర్వహించేవారు. పాత సచివాలయ భవనాలను కూలగొట్టి ఆర్భాటంగా నూతన సచివాలయ భవనాన్ని నిర్మించినప్పటికీ అక్కడికి కూడా వెళ్లలేదు ఇలాంటి పోకడల వల్లనే రెండేళ్ల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ అధికారాన్ని కోల్పోయారు. 1989కి ముందు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ తరచూ గండిపేట వద్ద నిర్మించుకున్న ఆశ్రమానికి వెళ్లేవారు. అప్పుడు దానిపై విమర్శలు వచ్చాయి. 2023 ఎన్నికలకు ముందు కేసీఆర్ కూడా ప్రగతి భవన్‌లో ఉండకుండా తన ఫాం హౌస్‌లో ఎక్కువగా గడిపేవారు. ఇలాంటి చర్యల వల్ల ఇరువురూ అధికారం కోల్పోయారు. ఇప్పుడు జగన్ రెడ్డి విషయానికి వద్దాం! 'ఏ రాష్ట్రానికైనా రాజధాని అవసరమా? రాజధాని అన్న పదం రాజ్యాంగంలో ఎక్కడుంది?' అని ఆయన తాజాగా ప్రశ్నిస్తున్నారు. అమరావతిని 'సోకాల్డ్' రాజధాని అని ఎద్దేవా చేశారు. విజయవాడ--గుంటూరు మధ్య కాకుండా నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మించడమేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగంలో రాజధాని అన్న పదం ఉందా? లేదా? అన్న విషయం పక్కన పెడితే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రాజధాని అన్న పదం ఉంది కదా? ప్రపంచంలో రాజధాని లేని దేశం ఏదైనా ఉందా? మన దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందా? ఛత్తీస్‌గఢ్, జార?ండ్, ఉత్తరాఖండ్ వంటి కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలకు కూడా రాజధానులు ఉన్నాయి కదా? ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే రాజధాని అవసరం లేదని జగన్ రెడ్డి ఎందుకు భావిస్తున్నారో తెలియదు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అని ప్రకటించారు. అది కార్యరూపం దాల్చక ముందే అధికారం కోల్పోయారు. తమ పార్టీ విధానం మూడు రాజధానులు అని ప్రకటించడంలో తప్పులేదు. 2019కి ముందు అసెంబ్లీ సాక్షిగా తాను కూడా బలపరిచిన అమరావతిపై ఆయనకు అంత ద్వేషం, పగ, అసూయ ఎందుకో? అన్నదే అంతు చిక్కని ప్రశ్న! రాజధాని అమరావతిపై తన మనసులోని ద్వేషాన్ని ఆయన గురువారం నాడు మరోమారు వెళ్లగక్కారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టబోతోందన్న వార్తలు వస్తున్నాయి. బహుశా ఈ కారణంగా సదరు బిల్లును అడ్డుకోవడానికి... సందర్భం కాకపోయినా జగన్ రెడ్డి అమరావతిని వ్యతిరేకిస్తూ మాట్లాడి ఉండవచ్చు. రాష్ట్రం విడిపోయి పదకొండున్నర సంవత్సరాలు అయింది. ఇప్పటికీ రాజధాని విషయమై వివాదం కొనసాగడాన్ని మించిన విషాదం ఏముంటుంది?

**నదులూ... నాగరికత..**

రివర్ బేసిన్‌లో, అంటే నదీ పరీవాహక ప్రాంతంలో రాజధానిని నిర్మించడం ఏమిటి? అని జగన్ రెడ్డి తాజాగా ప్రశ్నిస్తున్నారు. నదులకు, నాగరికతకు మధ్య విడదీయరాని బంధం అనాదిగా ఉంది. నదులు ఉన్న చోటే నాగరికత వెల్లివిరిసింది. ప్రపంచంలో అనేక మహా నగరాలు నదీ తీరాలలోనే నిర్మితమయ్యాయి. అనేక నగరాల మధ్య నుంచి నదులు ప్రవహిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రాజధానిగా పేరొందిన న్యూయార్క్ నగరం హడ్సన్ నదీ తీరం వెంబడి నిర్మితం కాలేదా? సీన్ నదీ తీరం వెంట ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్, ఇంగ్లండ్ రాజధాని లండన్ నగరం థేమ్స్ నదీ తీరం వెంట, ఇటలీ రాజధాని రోమ్ నగరం టైబర్ నది వెంట, నైలు నదీ తీరంలో ఈజిప్టు రాజధాని కైరో, చైనాలోని షాంఘై నగరం యాంగ్జి నదీ తీరం వెంట నిర్మితమైనవే కదా? ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో ఉదాహరణలు. నదుల వెంటే నాగరికత పరిఢవిల్లిన విషయం జగన్ రెడ్డికి తెలియదా? ప్రజలు ఎడారులను నివాస ప్రాంతాలుగా ఎంచుకోరు కదా? నీరున్న చోటే నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. వ్యవసాయం చేస్తుంటారు. ఎడారి దేశాలు కూడా డీ శాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని నీటి అవసరాలు తీర్చుకుంటున్నాయి కదా! తరచుగా లండన్ వెళ్లే జగన్ రెడ్డి అక్కడ థేమ్స్ నదిని చూసే ఉంటారు కదా? ఇంతెందుకు, గోల్కొండ నవాబులు హైదరాబాద్ నగరాన్ని మూసీ నది ఒడ్డునే నిర్మించారు కదా? మూసీ నది ఇప్పుడు మురికి కూపంగా మారి ఉండవచ్చునుగానీ, ఒకప్పుడు ఆ నదికి వరదలు వచ్చేవి కదా? మూసీ ప్రక్షాళనకు ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది కదా?

**జగన్ రెడ్డి.. నాడూ నేడూ**

అమరావతి గురించి ఇప్పుడు అవాకులు చెవాకులు పేలుతున్న జగన్ రెడ్డి 2019కి ముందు ఏం చెప్పారో ఒకసారి గుర్తుచేసుకుందాం. తాగునీటి అవసరాలు తీరడానికి రాజధాని నదీ తీరంలో నిర్మించాలని చెప్పలేదా? రాష్ట్రానికి మధ్యలో రాజధాని ఉండాలని, కనీసం 30 వేల ఎకరాల భూమి ఉండాలని, అమరావతిని రాజధానిగా ప్రకటించినందున తాను కూడా తాడేపల్లిలో ఇల్లు నిర్మించుకున్నానని చెప్పలేదా? అదే పెద్దమనిషి 2019లో అధికారంలోకి రాగానే రాజధానిని ఒక కులం వారి కోసమే కడుతున్నారని నిందలు వేయడమే కాకుండా మూడు రాజధానుల అంశాన్ని తెర మీదకు తెచ్చారు. అమరావతిని శ్మశానంతో, ఎడారితో పోల్చారు. భూములు ఇచ్చిన రైతులను అనేక విధాలుగా వేధించి అవమానాలకు గురిచేశారు. ఇప్పుడు రివర్ బేసిన్ అనే కొత్త రాగం అందుకున్నారు. అమరావతి విషయంలో ఆయన బాధ ఏమిటో తెలియదు. అమరావతి ప్రాంతంలో ఇప్పుడు ఒక్క కులానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారని అనుకుందాం. అక్కడ రాజధాని ఏర్పడితే ఇప్పుడు హైదరాబాద్‌లో వలె దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉద్యోగాలు, వ్యాపారాలకోసం వచ్చి స్థిరపడిపోతారు. అప్పుడు భూమి పుత్రులు మైనారిటీలు అయిపోతారు. భూమి కూడా చేతులు మారుతుంది. ఒకప్పుడు హైదరాబాద్‌లో అధిక శాతం భూమి ముస్లింల ఆధీనంలో ఉండేది. హైదరాబాద్ విస్తరణతోపాటు భూమి కూడా చేతులు మారింది. ఇంకా చెప్పాలంటే, హైదరాబాద్‌లోని భూమి పుత్రులు అస్తిత్వం కోసం పోరాడాల్సిన పరిస్థితి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే ధనికులయ్యారు. ముస్లింలు సంఖ్యాపరంగా గణనీయంగా ఉన్నప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిపోయారు. ఇప్పుడు హైదరాబాద్ అసలు సిసలైన కాస్మోపాలిటన్ నగరం. ఈ కారణంగానే హైదరాబాద్‌లో మత కలహాలు కూడా మటుమాయమయ్యాయి. హైదరాబాద్‌కు ఇప్పుడు ఉన్న విశిష్టత దక్షిణాదిన మరే నగరానికీ లేదు. అంతా సవ్యంగా సాగితే అమరావతి కూడా హైదరాబాద్ అంత కాకపోయినా ఒక పెద్ద నగరంగా అభివృద్ధి చెందుతుంది. అప్పుడు కులాల కుంపట్లు కూడా ఆరిపోతాయి. సంకుచిత భావజాలం కూడా నశిస్తుంది. బయటి ప్రాంతాల వారి సంఖ్య పెరిగే కొద్దీ స్థానికుల ఆధిపత్యం పోతుంది. జగన్ రెడ్డి ద్వేషించే ఆ కులం వారి ఆధిపత్యం కూడా పోతుంది. అభివృద్ధితో పాటు సామాజికంగా వచ్చే మార్పులు ఏమిటో జగన్ రెడ్డికి తెలియవా? అయినా ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇంత సంకుచితంగా ఎలా వ్యవహరించగలరన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంటోంది. స్థానిక విలేకరులతో మాట్లాడిన తర్వాత జగన్ రెడ్డి జాతీయ మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా ఆంగ్లంలో మాట్లాడారు. అంటే, తాను అమరావతిని రాజధానిగా వ్యతిరేకిస్తున్నానని ఢిల్లీ స్థాయిలో చెప్పాలన్నది ఆయన ఉద్దేశం. రివర్ బేసిన్‌లో రాజధాని నిర్మించకుండా అవసరమైతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కూడా ఆయన అన్నారు. దీన్నిబట్టి అమరావతి నిర్మాణాన్ని ఏదో ఒక విధంగా అడ్డుకోవాలన్న కృతనిశ్చయంతో ఆయన ఉన్నట్టు అర్థమవుతోంది. అసూయా ద్వేషాలు ఎంతటి వారినైనా దహించి వేస్తాయి.

బహిరంగంగా చెప్పుకోలేని కారణాలతో జగన్ రెడ్డి అంతర్గతంగా దహించుకుపోతున్నారు. అందుకే రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించకుండా అడ్డుకొనే ప్రయత్నాలకు తెర లేపారు. అందులో భాగంగానే రివర్ బేసిన్ అనే వాదాన్ని తెరమీదకు తెచ్చారు.

## అత్యాధునిక పద్ధతిలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాలు: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి

తొలగించిన టీబీఎం స్థానంలో అత్యాధునిక పద్ధతిలో టన్నెల్ తవ్వకాలు జరపనున్నారు. మిగిలిన సొరంగ మార్గం 9.8 కిలోమీటర్ల పరిస్థితులపై సమాచారం అందించే ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పూర్తయినట్టు అధికారులు మంత్రికి వివరించారు. భూగర్భ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసే విధంగా సపోర్ట్ సిస్టం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచంలోనే అతి పొడవైన సొరంగ మార్గం ఎస్ఎల్‌బీసీని పూర్తిచేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఉత్తమ్ వివరించారు. సొరంగ మార్గం పనుల్లో క్షత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి 25శాతం అదనపు జీతాలు ఉంటాయని తెలిపారు. భారత రాష్ట్ర సమితి పదేళ్ల పాలన వల్లే ఎస్ఎల్‌బీసీ పనుల్లో ఆలస్యం జరిగిందన్న మంత్రి.. ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండను సస్యశ్యామలం చేయడమే కాకుండా, ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా లేకుండా చేస్తామని ప్రకటించారు.

## పవన్‌కల్యాణ్ అరుదైన ఘనత..

మొదటి పేజీ తరువాయి

మూడు దశాబ్దాలకు పైగా సాగించిన సాధన, పరిశోధన, అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. కరాటే, యుద్ధకళల పట్ల ఆసక్తి కలిగిన పవన్.. చెన్నైలో ఉండగానే కఠినమైన శిక్షణతో పాటు నిరంతర సాధన చేశారు. శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి వాటిని అనుసరించారు. పలు సినిమాల్లో మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు, ప్రజాదరణ తీసుకొచ్చారు.

జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటైన 'సోగో బుడో కన్‌రి కై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదో డాన్) పురస్కారం లభించింది. జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్‌'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదు అందించింది. ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహమ్మదీ మార్గ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం పొందారు. సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రాలను అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

ఇక సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం ఆయన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రీకరణ పూర్తయింది. హరీశ్ శంకర్ దర్శకుడు. శ్రీలీల కథనాయిక. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా చేసేందుకు పవన్‌కల్యాణ్ సిద్ధమవుతున్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన ప్రకటన కూడా వెలువడింది.

## సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే సహించం: తలసాని



హైదరాబాద్: సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. డీలిమిటేషన్ పేరుతో సికింద్రాబాద్‌ను ముక్కలు చేస్తే సహించేది లేదని.. కార్పొరేషన్‌తో పాటు జిల్లాను కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. "ఈ నెల 17న నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని నిర్ణయించాం. సికింద్రాబాద్‌లో రైల్‌రోకో, బంద్‌లు నిర్వహిస్తాం. నిరవధిక దీక్షలు, అవసరమైతే ఆమరణ దీక్ష చేస్తాం. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బకొట్టే కుట్ర జరుగుతోంది. జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉంది. మేయర్‌కి కూడా తెలియకుండా డివిజన్లు విభజించారు" అని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

## గోదావరి జిల్లాలను తలపించేలా విజయవాడలో పందేల బరులు



విజయవాడ: మూడు రోజులపాటు జరిగే సంక్రాంతి పండగ వచ్చిందంటే ఆ సందడే వేరు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో ముందుగానే సంక్రాంతి పండగ సందడి కనిపిస్తోంది. గోదావరి జిల్లాలను తలపించేలా నగర శివారులో పందేల బరులు సిద్ధమవుతున్నాయి. వేలమంది పందేలను వీక్షించేలా భారీఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ప్రధాన రహదార్లకు సమీపంలోని తోటలు, ఖాళీ లేఅవుట్లలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళలు, చిన్నారులు ఇళ్ల వద్ద పండగ జరుపుకొంటే.. పురుషులు కోడి పందేలు, పొట్టేల పందేల కోసం వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. చట్ట సమ్మతం కానప్పటికీ తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ పండగ చేసుకోవడం అలవాటుగా మారింది. దీంతో.. కోడి పందేలు, పొట్టేల పందేల బరులను సిద్ధం చేస్తున్నారు. భారీ బరుల్లో ఒకేసారి 4, 5వేల మంది కూర్చునేలా వేదికను సిద్ధం చేస్తున్నారు. నిర్వాహకులు జారీ చేసిన టోకెన్లు ఉన్నవారినే లోపలికి అనుమతిస్తారు. వారికే శీతల పానియాలు, భోజనాలు అందించనున్నారు. కోడిపందేల బరులతోపాటు ఎగ్జిబిషన్లు, మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారుల కోసం జెయింట్ వీల్స్ వంటివి పెడుతున్నారు. పిండివంటలతో ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. క్రీడా మైదానం మాదిరిగా కుర్చీలతో గ్యాలరీలను ఏర్పాటు చేసి వేదికను అందంగా తీర్చిదిద్దుతున్నారు. రంగురంగుల అలంకరణలతో బరులు కొత్త హంగులు

## 1000 ఏళ్ల తర్వాత కూడా ఈ ఆలయంపై జెండా ఎగురుతూనే ఉంది: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

ఆలయంపై దాడికి వెయ్యేళ్లయిన సందర్భంగా ప్రధాని మోదీ ఇటీవల ప్రత్యేక వ్యాసం రాసిన సంగతి తెలిసిందే. పుణ్యక్షేత్రంపై గజనీ మహమ్మద్ క్రూర, హింసాత్మక దండయాత్ర చేసింది 1026 జనవరిలోనేనని, ఆలయ పునరుద్ధరణ తర్వాత 1951 మే 11న ఆనాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ సమక్షంలో ఆలయంలో భక్తులకు మళ్లీ దర్శనభాగ్యం కలిగిందని అందులో పేర్కొన్నారు. దాడి ప్రయత్నం జరిగిన ప్రతిసారీ ఆలయాన్ని కాపాడుకునేందుకు ప్రజలు దృఢంగా అడ్డుపడ్డారని, కొందరు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేసుకున్నారు.

## పోలవరం - నల్లమలసాగర్‌పై సుప్రీంలో విచారణ.. లీగల్ టీమ్‌తో మంత్రి నిమ్మల సమీక్ష

మొదటి పేజీ తరువాయి

అమరావతి: పోలవరం - నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ నేపథ్యంలో అధికారులతో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, న్యాయవాదులు, ఇంటర్ స్టేట్ ఇరిగేషన్ ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించాలని మంత్రి నిమ్మల.. లీగల్ టీమ్‌కు సూచించారు.కేసుకు సంబంధించిన అన్ని రికార్డులు లీగల్ టీంకు అందించాలని ఇరిగేషన్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఏటా వృథగా సముద్రంలో కలుస్తున్న 3వేల టీఎంసీలలో 200 టీఎంసీలు మాత్రమే తీసుకునేలా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించామని తెలిపారు. గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (+ఔఙు) అవార్డు ప్రకారం మిగిలిన నీటిని వినియోగించే హక్కు ఏపీకి ఉందని రామానాయుడు స్పష్టం చేశారు. గోదావరి బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్ దిగువ ప్రవాహ రాష్ట్రం కావడంతో.. ఇతర రాష్ట్రాల హక్కులకు భంగం కలగకుండా మిగిలిన వరద నీటిని వాడుకోవచ్చన్నారు. వృథగా సముద్రంలోకి పోతున్న నీటిని రాయలసీమ ప్రాంతానికి తరలించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని తేల్చి చెప్పారు. కేంద్రానికి ప్రాజెక్ట్ ఫీజుబులిటీ రిపోర్ట్ సమర్పించాం, వారి సూచనల మేరకే మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు. డీపీఆర్‌కి సంబంధించిన టెండర్లు కేవలం ముందస్తు సన్నాహక చర్య మాత్రమే అని తెలిపారు. చట్టపరమైన అన్ని అనుమతులు వచ్చాకే పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు చేపడతామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై ఒక్కసారిగా పెరిగిన రద్దీ

మొదటి పేజీ తరువాయి

చౌటుప్పల్ గ్రామీణం: సంక్రాంతికి వెళ్లే వాహనాలతో హైదరాబాద్-విజయవాడ హైవేపై రద్దీ కొనసాగుతోంది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వేకువజాము నుంచి రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఏపీ వైపు వెళ్లే వాహనాలు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో ఎక్కువ టోల్ బూత్‌లను ఓపెన్ చేశారు. కార్లు, ఇతర వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 70వేల వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని పంతంగి టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు. ఇవాళ రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. టోల్ ప్లాజా వద్ద వాహనాలకు ఫాస్టాగ్ స్కాన్ వేగంగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్‌ప్లాజాల వద్ద పెట్రోలింగ్ వాహనం, క్రేన్, అంబులెన్స్ అందుబాటులో ఉంచారు. మరోవైపు హైదరాబాద్ నుంచి వస్తున్న వాహనాలతో ఏపీలోని నందిగామ వద్ద ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో వైజంక్షన్ వద్ద రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

ఇటీవల తిరువనంతపురం నగరపాలక ఎన్నికల్లో 50 స్థానాలతో భాజపా విజయభేరి మోగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అక్కడ ప్రతినిధులను కలిసి.. కేరళ అభివృద్ధికి తమ పార్టీ అమలు చేయబోయే భవిష్యత్తు ప్రణాళికలపై షా ప్రసంగించారు. "ఈ విజయంతో మన లక్ష్య సాధనకు ఓ ముందడుగు పడింది. మన పార్టీకి చెందిన వ్యక్తి ఏదో ఒక రోజు సీఎం అవ్వడం ఖాయం. కేరళను పూర్తిగా అభివృద్ధి చేయడంతో పాటు జాతి వ్యతిరేకుల నుంచి రాష్ట్రాన్ని కాపాడటం ఎన్డీయే నేతృత్వంలోనే జరుగుతుంది. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడం ప్రధాని మోదీ ఆశయం. అది కేరళ అభివృద్ధితోనే సాధ్యమవుతుంది' అని అమిత్ షా ఉద్ఘాటించారు. అలానే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గుతోందని, మరోవైపు దేశంలో కాంగ్రెస్ కూడా కనుమరుగవుతుందన్నారు.

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో 45 ఏళ్లుగా అధికారంలో ఉన్న వామపక్ష పాలనకు ఎదురుదెబ్బ తగిలింది. 101 వార్డుల్లో ఎల్డీఎఫ్ 29 గెలువగా, భాజపా నేతృత్వంలోని ఎన్డీయే 50 స్థానాలు గెలిచి విజయం సాధించింది.

## ఫోన్, ఇంటర్నెట్ వాడని అజిత్ ధోబాల్..

మొదటి పేజీ తరువాయి

భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ ఫోన్, ఇంటర్నెట్ వాడరట. తన రోజూవారీ కార్యకలాపాల్లో వాటికి చోటివ్వరట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు.

"నేను ఇంటర్నెట్ ఉపయోగించననే మాట నిజమే. ఫోన్ కూడా వాడను. కుటుంబ సభ్యులు, ఇతర దేశాల్లోని ప్రజలతో మాట్లాడేందుకు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఉపయోగిస్తాను. అది కూడా అవసరం అనుకుంటేనే. అవి రెండూ లేకుండా విధులు నిర్వర్తించేలా ప్లాన్ చేసుకుంటాను. కమ్యూనికేషన్‌కు చాలా మార్గాలు ఉన్నాయి. అందులో ప్రజలకు తెలియనివి ఎన్నో ఉన్నాయి. వాటిని కూడా పరిచయం చేయాలి" అని ధోబాల్ సూచించారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

ఈ అలవాటును విడిచిపెట్టొద్దు

1945లో ఉత్తరాఖండ్‌లో జన్మించిన ధోబాల్.. 1968లో ఐపీఎస్‌లో చేరారు. విధుల్లో చూపిన ధైర్యసాహసాలకుగానూ కీర్తిచక్ర అందుకున్నారు. ఆ అవార్డు అందుకున్న పిన్నవయస్కుడైన పోలీసు ఆఫీసర్ ఆయనే కావడం విశేషం. మిజోరం, పంజాబ్, ఈశాన్య ప్రాంతాల్లో చోటుచేసుకున్న తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్లలో కీలకంగా వ్యవహరించారు. కేరళ క్యాడర్‌కు చెందిన ఆయన నిఘా, అంతర్గత భద్రతా విభాగాల్లో ఎక్కువకాలం పనిచేశారు. జాతీయ భద్రతా నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. వాటిల్లో 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ స్ట్రైక్స్ ఉన్నాయి.

## మద్యం మత్తులో డ్రైవర్.. విజయవాడలో కారు బీభత్సం..



భవానీపురం(విజయవాడ): నగరంలోని భవానీపురం బొబ్బూరి గ్రౌండ్స్ ఎగ్జిబిషన్ ప్రాంగణంలో కారు బీభత్సం సృష్టించింది. రాజరాజేశ్వరి పేటకు చెందిన ఓ యూట్యూబర్ మద్యం మత్తులో కారు నడిపి ముగ్గురిని ఢీకొట్టాడు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం తర్వాత డ్రైవర్ కారు ఆపకుండా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. గాయపడిన వారిలో ఓ బాలుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు సమాచారం.

# అంబేద్కర్ లేకుంటే దేశం చీకట్లో మగ్గేది

- కీసరలో వైభవంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు 205వ వారం జ్ఞానమాల కార్యక్రమం..
- కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ
- ముఖ్య అతిధిగా హాజరైన కీసర శ్రద్ధ, స్ఫూర్తి కళాశాలల చైర్మన్ ఎండి మధార్

**కీసర, జనవరి11,సందేశం టైమ్స్:** సామాజిక విప్లవ మహోపాధ్యాయుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు అని కీసర శ్రద్ధ, స్ఫూర్తి కళాశాలల చైర్మన్ ఎండి మధార్ పేర్కొన్నారు. దేశంలోని అణగారిన వర్గాలను జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆయన ఎన్నో అవమానాలు ఎదుర్కొని కుల రక్కసి చీకట్లను చీల్చి భారతదేశ ప్రజలకు సమానత్వ ప్రజాస్వామ్యంను అందించిన యోధుడు భారత రాజ్యాంగం నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ అని మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్ వివరించారు. ప్రజలను చైతన్యం చేస్తూ అంబెద్కర్ గారి



ఆశయాలను ప్రజల్లోకి తీసుకుపోయే దిశగా కొనసాగిస్తున్న జ్ఞానమాల కార్యక్రమం మండల కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతుంది. ఆదివారం 205వారం జ్ఞానమాల సమర్పణకు ముఖ్య అతిధిగా మండల కమిటీ ఆహ్వానం మేరకు కీసర శ్రద్ధ, స్ఫూర్తి కళాశాలల చైర్మన్ ఎండి మధార్, విచ్చేశారు. సుమారు 580మంది విద్యార్థులతో వచ్చిన కళాశాల చైర్మన్ మధార్ అంబేద్కర్ సంఘం చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను స్పందిస్తూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నింపి అక్షరాన్ని ఆయుధంగా మలిచి జ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, సమాజంలో నిమ్నజాతి వర్గాలకు రాజ్య అధికారాన్ని చేరువచేసే



దిశగా వైపు అంబేద్కర్ రచన చేసినట్లు వివరించారు. ఆ మహనీయుడు కృషివల్లే నేడు అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నట్లు తెలిపారు. నేటితరం యువత అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. పెద్ద ఎత్తున్న జ్ఞానమాలకు తరలివచ్చిన కళాశాల విద్యార్థులతో కీసర ప్రధాన చౌరస్తా ఓ పండుగ వాతావరణంను తలపించింది. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిధికి మండల కమిటీ అంబేద్కర్ గారి చిత్రపటంకు జ్ఞాపికగా అందజేశారు. ముందస్తుగా బాధ్యతతో ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకొని మండల కమిటీ పోలీసుల సహకారంతో ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు గోరంటి ప్రవీణ్, పులిపాక తిరుపతి, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శిలు తాళ్ళ కిరణ్, కుర్రి పరమేష్, మంచాల మహేష్, ఎంకిరాల నర్సింగ్ రావు, ముఖ్య సలహాదారులు రొండ్ల కృష్ణ, చినింగని ఆనంద్ రావు, మంగళపురి వెంకటేష్, రాగుల రమేష్ ముదిరాజ్, కీసర శ్రీ సీతారామచంద్ర ఆలయ చైర్మన్ నాయకపు వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్ రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాయకపు గంగారాం ముదిరాజ్, కీసర మాజీ వార్డు సభ్యులు శీలం మల్లేష్, మచ్చని రమేష్ యాదవ్, తుడుం శ్రీనివాస్, మాజీ అంబేద్కర్ సంఘం కోశాధికారి కానుకుంట్ల శ్యాం కుమార్, అంబేద్కర్ సంఘం బ్కళాశాల అధ్యాపక బృందం నర్సింహ, భాస్కర్, సంతోష్ ,యమున, మహేశ్వరి, దమ్మాయిగూడ బీఆర్ ఎస్ ఎస్సి సెల్ అధ్యక్షుడు బోడ నరేష్, నాయకులు కనకయ్య, అంబెద్కర్ సంఘం గ్రామ నాయకులు ఎర్రోల సాయిలు పెద్ద ఎత్తున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుకపై వట్‌పల్లి పోలీసుల పంజా

**సందేశం టైమ్స్ : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 11**





జనవరి సంగారెడ్డి జిల్లా అక్రమ ఇసుక రవాణాపై వట్‌పల్లి పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. తేదీ 10.01.2026 రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, 11.01.2026 అర్ధరాత్రి 01:15 గంటలకు అల్లాదుర్గం నుంచి బీదర్ వైపు వెళు్తన్న ఖూా 32 ూూూ 1765 లారీని తనిఖీ చేయగా సంగారెడ్డి నుంచి అక్రమంగా ఇసుక నింపుకొని తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్‌గా యాదుల పాషా (26), తండ్రి పైజోద్దీన్, సతోలి గ్రామం, బీదర్ జిల్లా (కర్ణాటక)కు చెందిన వ్యక్తిగా గుర్తించగా, లారీ యజమాని ఇసాక్ సూచన మేరకు అక్రమ రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. అదే రాత్రి 02:20 గంటలకు ూ 08 ఖ+ 7892 లారీని తనిఖీ చేయగా, డ్రైవర్ షేక్ అబ్దుల్ మొబిన్ (36), తండ్రి షేక్ వైహీద్, జహీరాబాద్, సంగారెడ్డి జిల్లాకు చెందినవాడిగా గుర్తించబడగా, లారీ యజమాని మహ్మద్ సాబర్ సూచన మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనలో వట్‌పల్లి ఎస్.ఐ. గారు సిబ్బందితో కలిసి రెండు లారీలు, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, అక్రమ ఇసుక రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మహనీయులు అంబేద్కర్, పూలే ల ఆశయాలను కొనసాగిద్దాం..

- వెనుకబడిన తరగతుల అందరు ఏకమై రాజ్యాధికారం కోసం పోరాడాలి..
- యువత అంబేద్కర్ సూచనలను పాటించి ముందుకు సాగాలి..
- మహిళలు మగవారితో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలి..
- సమసమాజ నిర్మాణం కోసం మనందరం పోరాడాలి..
- జ్ఞాన మాల కార్యక్రమంలో గౌడ రవికిరణ్, ఈగ శ్వేత రాజు లు కొనియాడారు...

**కీసర, జనవరి11,సందేశం టైమ్స్:** భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వారు చూపిన మార్గంలో మనందరం నడవడమే వారికి మనం ఇచ్చే గొప్ప నివాళి అని మేడ్చల్ మార్కెట్ కమిటి డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజు, దళిత రత్నా అవార్డు గ్రహీత, ఎస్సీ ఎస్టీ రాష్ట్ర నాయకులు గౌడ రవికిరణ్ లు అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ డివిజన్ పరిధి రాజీవ్ గృహకల్ప కాలనీలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి 201వ,మహాత్మా జ్యోతిరావు పూలే గారికి 1వ జ్ఞాన మాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యి మహనీయుల విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు ఈ



సందర్భంగా మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగానే కాక ఆయన గురువు అయిన మహాత్మా జ్యోతిరావు పూలే గారు కలలు కన్న ఆశయలను సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన కలలు కన్న భారత దేశాన్ని నిర్మించడానికి యువత ముందుకు రావాలాంటూ, విద్య, సామాజిక న్యాయం, చైతన్యం, హక్కుల పరిరక్షణ---ఇవి అంబేద్కర్ చూపిన మార్గాలు అన్నారు. మనందరం వాటిని ఆచరణలో పెట్టినప్పుడే మనం మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకపోయిన వాళ్ళం అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం,ఆర్జికే మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాట రాజు, సలహాదారులు అబ్బులు,మాజీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ఆర్జీకే కాలనీ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈగ రాజు, కోశాధికారి చెన్నయ్య, ఆర్జీకే మాల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షురాలు రూప చంద్రమౌళి,రిపోర్టర్ విష్ణు మోహన్, మాల సంఘం సభ్యులు జయమయ్య, శ్రీను, పెద్దలు కనకయ్య,బీసీ సంఘం నేత బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బోరంచలో నల్ల పోచమ్మ తల్లి దర్శనం ఘనంగా GMR ఫౌండేషన్ చైర్మన్ భక్తి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు

**సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 11జనవరి**





సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని ప్రసిద్ధ బోరంచ గ్రామంలో నల్ల పోచమ్మ తల్లి దర్శన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్, పార్టీ సీనియర్ నాయకుడు గుజ్జుప మచ్చేందర్ కుటుంబ సభ్యులు, టీం సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బోరంచ గ్రామం, నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆరోగ్యవంతమైన జీవితం పొందాలని, రైతులు సమృద్ధిగా పంటలు పండించాలని, యువతకు ఉద్యోగావకాశాలు పెరగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో బోరంచ గ్రామం రానున్న కాలంలో మరింత అభివృద్ధి చెందుతుందని, ప్రజల సమస్యలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మచ్చేందర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్లు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో మచ్చేందర్ సన్నిహితంగా కలసి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామ ప్రజలు మచ్చేందర్ సేవలను ప్రశంసిస్తూ, తమకు ఎల్లప్పుడూ అండగా నిలిచే నాయకుడిగా అభినందనలు తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఫౌండేషన్ గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం తదితర సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది.

# అక్షర హాస్పిటల్ డాక్టర్ సంతోష్ కు ఏజెంట్లుగా మారిన వైద్యాశాఖ జిల్లా అధికారులు.

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి.

**మద్దూరు జనవరి 11 సందేశం టైమ్స్: :** ఆదివారం మద్దూరు మండల కేంద్రంలో జరిగిన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆలేటి యాదగిరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన అక్షర హాస్పిటల్ డాక్టర్ సంతోష్ కుమార్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జెఏసి చైర్మన్ అని చెప్పుకుంటు గత కొంతకాలంగా చేర్యాల ప్రాంతంలో ఆర్.ఎం.పి డాక్టర్లు తన హాస్పిటల్ కు పెషేంట్లను పంపాలని అలా పంపని



వారిపైకి జిల్లా వైద్యాధికారులను పురమాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నది నిజమని పల్లెల్లో పేదలకు వైద్య సేవలు అందిస్తున్న వారిపై వేధింపులకు గురి చేయడము పనికిమాలిన చర్య అని వారి రాక్షసత్వానికి నిదర్శనమని అన్నారు. పేద ప్రజల రక్త మాంసాలతో వ్యాపారం చేస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న వారికి జిల్లా వైద్యశాఖ అధికారులు ఏజెంట్లుగా మారి వైద్య శాఖను భ్రష్టు పట్టిస్తూ కోట్ల రూపాయల వ్యాపారానికి సహకరిస్తున్నారని ప్రభుత్వ వైద్య రంగాన్ని నీరుగారుస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలని ప్రభుత్వ ఆస్పిటల్ లను ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలంగా సిపిఎం పార్టీ అనేక ఉద్యమాలుపోరాటాలు చేసిందని తెలిపారు. చేర్యాలకు అనేకమంది డాక్టర్లు వచ్చి ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించారని అలాంటి డాక్టర్లందర్నీ ఈ ప్రాంత ప్రజలు రాజకీయ నాయకులు అక్కున చేర్చుకున్నారని ఇప్పటికీ ఆ డాక్టర్ల పేర్లు చిరస్థాయిగా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని కేవలం సంతోష్ డాక్టర్ సంతోష్ కుమార్ వచ్చిన తరువాత తాను అనవసర రాజకీయాలు చేస్తూ వైద్య సిబ్బందిని వైద్యులను ఇబ్బందులకు గురి చేస్తూ వైద్య రంగానికి మచ్చ తెచ్చే విధంగా తన వ్యవహార శైలి ఉందని ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని వారి సేవలు ప్రజలకు ఉపయోగపడాలని వైద్యాధికారులు తనకు ఏజెంట్గా వ్యవహరించడం మానుకోవాలని లేని పక్షంలో ఈ ప్రాంత ప్రజల తోటి తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అల్ధ రమేష్,నారదాసు కనకయ్య,ఇరుమల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి మహోత్సవానికి భక్తులకు ఆహ్వానం

**సందేశం టైమ్స్ : నారాయణఖేడ్నియోజకవర్గం ఇంచార్జి జనవరి 11**



శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం, శ్రీ సద్గురు బసవలింగప్ప స్వామి సంస్థానం మఠం, బిచ్కుంద వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా శివరాత్రి మహోత్సవానికి భక్తులను ఊరు ఊరునా ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామంలో భక్తులకు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న అన్ని ధార్మిక కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో శ్రీ సద్గురు బండప్ప స్వామి భక్తులు రాజు, గోపాల్, శేఖర్, పరమేశ్వర్, రజనీకాంత్, ప్రశాంత్, సంగప్ప, నాగిశెట్టి రామకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొని పత్రికలను భక్తులకు అందజేశారు.

# ఉప్పరపల్లిలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహణ

**మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా జనవరి 11 సందేశం టైమ్స్:**



మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ 300వ వార్డు ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం రోజున మాజీ సర్పంచ్ కట్టెల రవీందర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని మొత్తం 115 మంది ముగ్గులు వేశారు. ముగ్గులు వేసిన మహిళలందరికీ నిర్వాహకులు చీరలను బహుమానంగా అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతిగా రూ.3,000, రెండో బహుమతిగా రూ.2,000, మూడో బహుమతిగా రూ.1,000 నగదు బహుమతులు అందజేశారు. మొత్తం 115 ముగ్గులలో 13 ముగ్గులను ఫైనల్‌కు ఎంపిక చేసి డ్రా పద్ధతిలో ముగ్గురు విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లపు రామచందర్, మాజీ కౌన్సిలర్ పొలమొల్ల పాండు, తెలంగాణ ఉద్యమకారుడు మైనబోయిన శంకర్, మాజీ వార్డ్ మెంబర్లు వల్లపు హరిబాబు, చాగంటి యాదగిరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కరకపట్ల రాము, గ్రామ పెద్దలు ముత్యాల సత్యనారాయణ, కోమటి లక్ష్మయ్య, టీఆర్ఎస్ విలేజ్ అధ్యక్షులు వల్లపు జగన్ కట్టెల రాజు తో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిరి క్యాలెండర్ ఆవిష్కరణ

- ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ఆధ్వర్యంలో

**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 11 జనవరి**



సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం వట్పల్లి మండలంలో ఆదివారం సిరి క్యాలెండర్‌ను రాయికోడ్ మండల్ ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాచూర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజలు--ప్రభుత్వం మధ్య వారే వారధులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ జోష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మన్నే ఈశ్వరయ్య, గౌర్రెకల్ గ్రామ సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి, పత్రి విట్టల్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని సిరి క్యాలెండర్ ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా ప్రపంచానికి పరిచయం

సందేశం టైమ్స్:
తెలంగాణ గుండె చప్పుడు, ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీకగా ఉన్న సమ్మక్క-సారలమ్మ జాతరకు ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించి సౌకర్యపూర్వకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం మేడారంలో జాతర ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, దనసరి సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పర్యవేక్షణ చేశారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "మేడారం జాతర కేవలం గిరిజనుల పండుగ మాత్రమే కాదు, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా ప్రపంచానికి పరిచయం చేయాలి. జాతర కోసం ఈ సంవత్సరం 251 కోట్లు ఖర్చు చేస్తున్నాం. భక్తుల సౌకర్యానికి ఏ విధమైన లోపాలు రాకుండా, శాశ్వత నిర్మాణాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయి" అని తెలిపారు. జాతర మాస్టర్ ప్లాన్ ప్రకారం, కోర్ ఏరియా మరియు పెరిఫెరల్ ఏరియాలుగా ప్రాంతాన్ని విభజించి, ఒకేసారి 8,000 మంది భక్తులు దర్శనం చేసుకునే సామర్థ్యాన్ని కల్పించామని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్ వివరించారు. గద్దెల ప్రాకారం, క్యూ లైన్‌లు, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్, పారిశుద్ధ్య, రవాణా, ఆరోగ్య, భద్రతా ఏర్పాట్లన్నీ సమగ్రంగా చేపట్టారు. సీతక్క మంత్రి మాట్లాడుతూ, "ప్రతి గంటకు సగటున వెయ్యి వాహనాలు చేరుతున్నాయి. దాదాపు ఐదు లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వాహనాలు వస్తాయి" అని తెలిపారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు క్రౌడ్ కంట్రోల్, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణ సాధించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ, అటవీ, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతరలో ఏర్పాట్లు 85% పూర్తయి, మిగిలిన పనులు 15వ తేదీ వరకు పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. 18వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానుండటంతో అక్కడే కేబినెట్



సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కూడా వెల్లడించారు. జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు, భక్తుల సౌకర్యం, భద్రతా, వైద్య సదుపాయాల సమగ్ర పర్యవేక్షణతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జాతరను విజయవంతం చేయడానికి కట్టుబడి ఉందని మంత్రి బట్టి విక్రమార్క్ తెలిపారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక సమ్మక్క--సారలమ్మ జాతర

- జాతరను ప్రపంచానికి పరిచయం చేస్తాం
- జాతర ఏర్పాట్లకు రూ.260 కోట్లు కేటాయింపు
- 15వ తేదీ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలి
- మేడారంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

సందేశం టైమ్స్:
సమ్మక్క--సారలమ్మ జాతర గిరిజనుల పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ గుండెచప్పుడు, రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీక అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం మేడారంలో జాతర ఏర్పాట్లను మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, అద్దులూరి లక్ష్మణ్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క--సారలమ్మ జాతర ప్రత్యేకత, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.260 కోట్లు ఖర్చు చేస్తోందని, ఇందులో రూ.150 కోట్లు జాతర



నిర్వహణకు, రూ.110 కోట్లు శాశ్వత ఆలయ నిర్మాణ పనులకు కేటాయించామని చెప్పారు. మేడారంలోనే పనులు, వ్యయంపై సమగ్రంగా సమీక్షించి, అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 85 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులన్నీ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర కోసం అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేశామని, పూర్తయిన పనుల బిల్లులు 24 గంటల్లోనే క్లియర్ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వాలు రూ.75 కోట్లు లేదా రూ.100 కోట్ల వరకు మాత్రమే ఖర్చు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.260 కోట్లు వెచ్చిస్తున్నదని ఆయన గుర్తు చేశారు. జాతర ముగిసే వరకు ఆరోగ్య, విద్యుత్ శాఖలతో పాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఈ మహా జాతరను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పొనుగోటి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎండపల్లి సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సంఘ రమేష్ యాదవ్

సందేశం టైమ్స్:
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు యువ నాయకులు సంగ రమేష్ యాదవ్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రా నాయకులు పొనుగోటి శ్రీనివాస్ రావు (బాపు) ని తన యొక్క ఆఫీస్ లో మండల



సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గా అయినా సందర్బంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు ఆశీస్సులు తీసుకోవటం జరిగింది ఈ సందర్బంలో పొనుగోటి శ్రీనివాసరావు నూతన మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సంఘ రమేష్ యాదవ్ ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

# గీసుకొండలో సిఐటియు మండల మీటింగ్:

- కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

సందేశం టైమ్స్:



నమిండ్ల సురేష్ అధ్యక్షతన ఈ రోజు సిఐటియు మండల మీటింగ్ నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.డి. బషీర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులను వెట్టిచాకిరి చేసే విధంగా ఉందని, రోజువారీ పని గంటలను 8 నుండి 10కి పెంచిన అంశాన్ని విమర్శించారు. అతని ప్రకారం, 2005లో ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం 90% నుండి 60%గా మార్పు చేసింది. అలాగే, స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న మహాత్మా గాంధీ పేరును తొలగించడం అన్యాయం అని తెలిపారు. వ్యవసాయ కూలీలకు 200 రోజుల పని కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధర అందించమని, కేంద్ర హామీలను అమలు చేయమని, రైతు ఆత్మహత్యలను ఆపమని బషీర్ డిమాండ్ చేశారు. ఆయన, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, రైతులకి గిట్టుబాటు ధర కల్పణ, విబి జీ రాంజీ పేరును తొలగించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోగిటి బ్రహ్మచారి, కోట సంతోష్, శ్రీనివాస్, కోట దేవయ్య, ఎల్లా స్వామి, రాము మదిలో పాల్గొన్నారు.

# ఖో-ఖో, కబడ్డీకి ప్రభుత్వ ప్రోత్సాహం

- గ్రామీణ యువతను క్రీడల వైపు మళ్లించడమే లక్ష్యం:
- మంత్రులు ఉత్తమ్, వాకాటి



సందేశం టైమ్స్:
ఖో-ఖో, కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడల ద్వారా గ్రామీణ యువతను క్రీడల వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తోందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం హన్మకొండ జిల్లా ఖాజీపేట రైల్వే స్టేషన్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 58వ జాతీయ ఖో-ఖో ఛాంపియన్‌షిప్ పోటీలను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ జాతీయ పోటీల్లో దేశవ్యాప్తంగా 79 ఖో-ఖో జట్లు, సుమారు 1,500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆదివారం సాయంత్రం టెస్ట్ మ్యాచ్‌తో పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో నేషనల్ స్పోర్ట్స్ అథరిటీ చైర్మన్ గోవింద్ శర్మ, రాష్ట్ర క్రీడల శాఖ అడ్వైజర్ జితేందర్ రెడ్డి, ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, నేషనల్ స్పోర్ట్స్ అథరిటీ సభ్యులు సుదర్శన్ విఠల్, ఉట్నూర్ తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ జాన్స్ హైస్కూల్లో ఎస్సెస్సీ 2000--01 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

సందేశం టైమ్స్:
గీసుకొండ మండలం మరియపురం గ్రామంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్లో ఆదివారం ఎస్సెస్సీ 2000--01 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను తలచుకుంటూ, గురువుల సేవలను కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ నిర్మలతో పాటు ఉపాధ్యాయులు రోజ్ మేరీ, మర్గరీత, శాంత మేరీ, విజయ నిర్మల, సునిత, కృష్ణమూర్తి, నర్సయ్య, రాజయ్య, యాదగిరి, నరేందర్, బిక్షపతి, పాపిరెడ్డి, ఇన్నారెడ్డి, బాలశౌరెడ్డి, రాంమూర్తి, రామ్మోహన్, భారతి కైలాసం, కుమార్ తదితరులు హాజరయ్యారు. పాఠశాల అందించిన విద్య, విలువలు తమ జీవితాలకు దిశానిర్దేశం చేశాయని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువులను సత్కరించి, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు.

# బాధిత కుటుంబానికి 15,000 రూపాయల ఆర్థిక సహాయం

సందేశం టైమ్స్:
గీసుకొండ మండలం వంచనగిరి గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణంగా అమిరిశెట్టి కొమురయ్య మృతి చెందారు. ఆదివారం వారి దశదినకర్మ సందర్భంగా, కుమారుడు అమిరిశెట్టి శ్రీనివాస్ (10వ తరగతి, 1998-99 బ్యాచ్) చిన్ననాటి



మిత్రులు ఆర్థిక సహాయంగా ?15,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమిరిశెట్టి రాజు, దూలం అనిల్, బొల్లం అశోక్, బక్కి రవి, బెంబిరి రమేశ్, కంచి రాజు, పులి రాజు, మధుకర్, సంధ్య, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు. మిత్రుల ఆప్యాయ సహకారం కుటుంబానికి మనస్పూర్తిగా ఆదరణగా నిలిచింది.

# ముత్తగూడెం లోని క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

సందేశం టైమ్స్:
పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామంలోని క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి ఆదివారం అన్నదాన కార్యక్రమం జరుగుతుంది అలాగే తిరువూరులోని అనాధలకు కూడా అన్నదానం అందించటం



జరుగుతుంది

# తెలుగు సాహిత్య గాన మంజూరి పురస్కారం...

సందేశం టైమ్స్:
భద్రాచల పట్టణంలోనీ శ్రీ సీతారామ కమ్మవారి సేవాసమితి కాకతీయ గ్రాండ్ కరకట్ట రోడ్డు భద్రాచలం. నందు సాహితి సాంస్కృతిక రంగంలో ఒక ప్రభంజనం సృష్టిస్తున్న జాతీయస్థాయి ఐఎస్ఓ గుర్తింపు పొందిన తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ మరియు ఉషోదయ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జానపద సంక్రాంతి నృత్య సంబరాలు జాతీయ కవి సమ్మేళనం మరియు సినీ సంగీత విభావరి తెలుగు సాహిత్య గాన మంజూరి పురస్కారం మేకల లత అనే నాకు లభించడం అది మీతో పంచుకోవడం నాకు ఎంతో సంతోషకరం... నాకు ఈ అవార్డును అందించినందుకు ఆ యొక్క సంస్థ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

# రూ 547 కోట్ల సైబర్ మోసం 17 మంది అరెస్ట్

సందేశం టైమ్స్:
కాల్ సెంటర్లు ఏపీకె ఫైళ్ళు ఓటీపీ ల ద్వారా అమాయకులను బురిడీ కొట్టించి రూ 547కోట్లు కోళ్లగొట్టిన అంతరాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు పెనుబల్లి పోలీస్ స్టేషన్లో సిపి సునీల్ దత్ వివరాలు వెల్లడిస్తూ ఈ ముఠా విదేశీ సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి మోసాలకు పాల్పడిందని తెలిపారు నిందితుల నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని వారి ఆస్తులను జప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు

# ముసి కనకయ్య దిన దాశిలి లికర్మ లో పాల్గొన్న మన ముదిరాజ్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం ఆచార్యుల గూడెం లో జరిగిన కోదాడ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ముసి శ్రీను గారి తండ్రి అయినటువంటి ముసి కనకయ్య గారి దిన దాశి



కర్మలో పాల్గొన్న మన ముదిరాజ్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్ దిన దాసి కర్మ అనేది హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం ఒక వ్యక్తి తన దైనందిన జీవితంలో చేసిన పనులు వాటి ఫలితాలను సూచిస్తుంది ఇందులో మంచి చెడు కర్మలు (శుభ సూచ కర్మలు ఉంటాయి ) ఈ కర్మ ఫలితాలను ఆ వ్యక్తి తప్పకుండా అనుభవించాల్సి ఉంటుందని కర్మ చెబుతుంది మరియు పునర్జన్మలను ప్రభావితం చేస్తుంది ఇట్టి కార్యక్రమంలో ఏసిపిచార్మినార్ మాజీ బుడిగ అంజయ్య, మన ముదిరాజ్ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాష బోయిన భాస్కరరావు,కోదాడ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ తమనబోయిన వీరబాబు, కన్నెబోయిన ఉష అల్లి వీరబాబు, ముసి మట్టయ్య, మామిడి రాములు, గుండ్లపల్లి వెంకన్న,దుస్సా వెంకటేశ్వర్లు, సాగర్ల రామ నరసయ్య, చిలక రమేష్, నార్ల మలుసూరు, బొల్లిపల్లి రామయ్య, దేశ బోయిన బ్రహ్మం, కంటూ నాగేశ్వరరావు, కన్నెబోయిన సత్యనారాయణ, రామారావు, ప్రధాని వెంకటేశ్వర్లు కొప్పెర వెంకట నరసయ్య, బొల్లిపెల్లి మల్లయ్య,సంతోష్, గువ్వల నాగేశ్వరరావు, తమ్మనబోయిన చిన్న రాములు తదితరులు పాల్గొని ఘన నివాళి అర్పించినారు

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.